ఆఫీసు నుంచి బయటపడ్డానికి ఇంకా ఇరవై నిమిషాల వ్యవధి ఉంది. అంతవరకూ చూసిన ఫైల్‌మూసి అలసటగా ఉండటంతో కుర్చీ వెనక్కి జారబడ్డాను.'

సరిగ్గా అప్పుడే కంగారుపడుతూ వచ్చాడు సింహాద్రి. అతని ముఖంలో ఏదో తెలియని దిగులు స్పష్టంగా ద్యోతక మవుతోంది...

“ఏమైంది సింహాద్రీ?” అన్నాను కుర్చీలోంచి కాస్త ముందుకు వొంగి.

“నాకు... నాకో... పదివేలు... సర్దుబాటు చెయ్యాలి శేఖరంగారూ!” తడబడుతూ అన్నాడతను.

నా పక్కనే టపాకాయ పేలినట్టు అదిరిపడ్డాను. ఒక్కసారిగా



# భలే సలహా

గుండె కొట్టుకునే వేగం హెచ్చింది... నేను గుమస్తాగా, సింహాద్రి అటెండరుగా ఆ ఆఫీసులో పనిచేస్తున్నాం. ఉంటున్నది కూడా ఒకే వీధిలో గనుక మా రెండు కుటుంబాలకూ కొద్దిపాటి పరిచయం ఉంది. అతని కంటే నాకొచ్చే జీతం ఎక్కువే అయినా పీత కష్టాలు పీతవన్నట్టు ఎంతో కొంత అప్పు జేస్తేతప్ప ఏ నెలా గడవటం లేదు. ఈ విషయం తెలిసీ నన్ను డబ్బు సర్దుబాటు చెయ్యమనడంలో సింహాద్రి ఉద్దేశమేమిటో అంతుబట్టలేదు.

"గురువారం డబ్బు తిరిగి ఇచ్చేస్తాను శేఖరంగారూ!" కొన్ని క్షణాల తర్వాత అన్నాడు సింహాద్రి.

"గురువారం రేపులేదు ఎల్లుండే కదయ్యా! ఇంతలోనే అంత డబ్బు దేనికి?" అడగకూడదనుకుంటూనే అడిగాను.

"అలాంటి అవసరం వచ్చి పడిందండీ!..." అని అతి భారంగా నిట్టూర్చాడు సింహాద్రి.

"ఆ అవసరం ఏమిటోగాని పదివేలు అప్పు ఇవ్వగలిగే స్తోమత నాకు లేదని నీకూ చెప్పాల్సి వచ్చినందుకు చింతిస్తున్నాను సింహాద్రీ!" అన్నాను.

"అయ్యయ్యో ఎంతమాట... డబ్బు మిమ్మల్ని ఇవ్వమని కాదు శేఖరంగారూ! పదివేలైనా - పాతికవేలైనా అరగంటలో పుట్టించగల పరపతి మీకుంది! ...ఆ విధంగా ఏర్పాటు చేస్తారన్న ఆశతోనే అడిగాను. మీరు కాదంటే రేపు మా ఇంట్లో జరగాల్సిన శుభకార్యం ఆగిపోతుంది. నేను అభాసుపాలౌతాను!" అన్నాడు దీనంగా సింహాద్రి.

"శుభకార్యమా! ...ఏమిటయ్యా ఆ శుభకార్యం?"

"అదేనండి, మా రెండో అమ్మాయికి పుట్టు వెంట్రుకలు తీయించిన సందర్భంగా రేపు బంధుమిత్రులందరికీ భోజనాలు పెట్టాలని ఇంట్లో ఆడవాళ్ళు తీర్మానించారు. నావద్ద కొంత డబ్బుంది గానీ అదెటూ సరిపోదండి!" అన్నాడు సింహాద్రి.

"బావుంది సింహాద్రీ! ...అమ్మాయికి పుట్టు వెంట్రుకలు తీయించినందుక్కూడా విందు చేస్తున్నావా?... అదీ అప్పుజేసి... ఇది మంచి పని కాదయ్యా!" అన్నాను మందలింపుగా.

"ఏం చెయ్యమంటారు శేఖరంగారూ! ఇదే మాట చెపితే మా అమ్మగారు ఒప్పుకోలేదు- ఆవిడకు మా ఆవిడతోడై - ఇద్దరూ నా ప్రాణాలు తోడేస్తూంటే - వాళ్ళ గొడవ పడలేక వారం క్రితమే మన వడ్డీ వరదరావుగారిని డబ్బు అప్పు అడిగాను. ఈ రోజు కచ్చితంగా ఇస్తానని చెప్పి - ఇప్పుడు డబ్బేదో అందలేదంటూ మొండి చెయ్యి చూపించాడాయన. అంచేత మీరు నన్ను ఆదుకోక తప్పదు!" అన్నాడు సింహాద్రి.

"ఈ ఆడవాళ్ళతో వచ్చిన చిక్కిదేనయ్యా! వాళ్ళేదంటే అది జరిగి తీరాలంటారు!! ఏదో పిల్ల పెద్దమనిషైనప్పుడో-పెళ్ళప్పుడో విందు చెయ్యడం తప్పనిసరి గాని - ఇలా అయిన

చోడిశెట్టి శ్రీనివాసరావు

దానికీ కానిదానికీ పెద్ద హడావిడెందుకు చెప్పు? అంతగా మీవాళ్ళు కాదూకూడదూ అంటున్నారు కాబట్టి నీ దగ్గరున్న డబ్బుతో కార్యక్రమం కానిచ్చెయ్యి!" అంటూ నాకు తోచిన సలహా ఇచ్చాను.

పైన తిరుగుతున్న పంకా మీదికి దృష్టి సారించాడు సింహాద్రి.

"వెళ్ళు సింహాద్రీ! నేను చెప్పినట్టు చెయ్యి" అన్నాను మళ్ళీ.

"లేదు శేఖరంగారూ! ఇప్పటికే దూరాన ఉన్న బంధుమిత్రులందరికీ కబురు పంపడం జరిగిపోయింది. ఈ రోజు ఊళ్ళో తెలిసిన వాళ్ళకు చెప్పేసి ఉంటారు... ఇప్పుడిక తప్పించుకోవడం కుదిరేపని కాదు. దయచేసి నామాట దక్కించండి- మీరు ఎవరివద్ద డబ్బు తెచ్చినా గురువారం వడ్డీతో సహా ఆ డబ్బిచ్చేస్తాను. నన్ను నమ్మండి!" అన్నాడు సింహాద్రి.

ఇక ఎన్ని చెప్పినా అతను వినిపించుకునే స్థితిలో లేడని నాకర్థమైపోయింది. నేను అవునంటే తప్ప అతను కదిలేటట్టు కనిపించలేదు – "సర్లే, సాయంత్రం ఇంటికి రావయ్యా, ఎలాగోలా చూస్తాను!" అన్నాను చివరికి.

తన సమస్య నాకప్పగించి ఆనందంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు సింహాద్రి.

అయిదు కాగానే ఆఫీసులోంచి బయట పడ్డాను. ఆరోజు బజార్లో ఏదో ముఖ్యమైన పని ఉన్నా వాయిదా వేసుకొని, తిన్నగా ఇంటి కొచ్చాను.

"రేపు మనకు సింహాద్రి గారింట్లో భోజనాలండోయ్!" అంది నన్ను చూస్తూనే శ్రీమతి.

"అయితే భోజనాలు చెప్పేశారన్నమాట!" అన్నాను నవ్వుతూ.

"చెప్పడంతో సరిపెట్టలేదు, వస్తామని చేతిలో చెయ్యి వేసేవరకూ సింహాద్రి భార్య వదిలి పెట్టలేదు" అంది తన ధోరణిలో శ్రీమతి.

"ఆలూలేదు- చూలూలేదు- కొడుకు పేరేదో అన్నట్టుగా ఉంది వీళ్ళ వరస..."

"ఏమిటలా అంటారు? సరదాగా వాళ్ళేదో శుభకార్యం జరుపుకుంటూంటే మధ్య మీకేమిటా బాధ?" అంది నామాటలకు మధ్యలోనే అడ్డొచ్చి శ్రీమతి.

"నువ్వు కోప్పడకోయ్ కోమలీ!... సింహాద్రి ఇంకా డబ్బుకోసం తిప్పలు పడుతున్నాడు... అది లేందే ఏపనీ జరగదు కదా..." అంటూ అసలు విషయం శ్రీమతికి వివరించాను.

"మీరు అభయమిచ్చి వచ్చారుగా, ఇక అతని జేబులో డబ్బున్నట్టే! ఉండండి... టీ తెస్తాను..." అంది శ్రీమతి.

"తొందరగా రా, నేను వెంటనే వెళ్ళి ఆపద్బాంధవుడు అచ్చారావుని పట్టుకోవాలి మరి!" అన్నాను.

అయిదు నిమిషాల్లో టీ తీసుకొచ్చింది శ్రీమతి.

టీ తాగి బయలుదేరుతూంటే- "రేపు మనం ఉత్తచేతులతో వాళ్ళింటికి భోజనానికెళ్ళడం బాగుండదు... మీరు వచ్చేటప్పుడు స్టీలుప్లేటో గ్లాసో కొని తీసుకురండి!" అంది శ్రీమతి.

"మళ్ళీ ఇదొకటా? సర్లే... సింహాద్రి వస్తే ఉండమని చెప్పు" అని సైకిలెక్కాను.

నేను తిరిగి ఇంటికొచ్చేసరికి చీకటి పడింది. వీధి అరుగుమీద కూర్చొని నాకోసం చూస్తున్నాడు సింహాద్రి. అచ్చారావుని అడిగి

'నెపోలియన్'కి పిల్లులంటే విపరీతమైన భయమట

తెచ్చిన డబ్బు అతని చేతిలో పెట్టి "గురువారం ఇచ్చేస్తామని చెప్పాను. అతడు ఎవరికో ఇస్తా నన్న డబ్బు ఆపు చేసి నాకిచ్చాడు. నువ్వు నా మాట నిలబెట్టాలి సుమా!" అన్నాను.

"భలేవారే!... ఈ క్షణం వరకూ తలపెట్టిన కార్యక్రమం ఎలా పూర్తవుతుందా అని తల్లడిల్లి పోయాను. ఇంత ఉపకారం చేసిన మిమ్మల్ని దగా చేస్తానా... మీకు మాట రానిస్తానా... ఆరు నూరైనా- నూరుఆరైనా గురువారం డబ్బిచ్చే స్తాను శేఖరంగారూ!" అని నమస్కారంపెట్టి వెళ్ళిపోయాడు సింహాద్రి.

ఆ తెల్లవారి ఎనిమిది గంటలకు సింహాద్రి భార్య వచ్చి మరోసారి పిలవడంతో- మధ్యా హ్నాం ఆఫీసులో ఓ గంట పర్మిషన్ పెట్టొచ్చి, శ్రీమతితో బాటు వాళ్ళింటికి భోజనానికెళ్ళక తప్పలేదు నాకు... బంధువులైతేనేం... స్నేహితు లైతేనేం చాలామందివచ్చారు. అందుకు తగ్గ ట్టుగా పెద్ద షామియానా, కుర్చీలు, టేబుల్స్ వేయించాడు...

కాకినాడ కోటయ్య కాజా, బందరు లడ్డూ లతో సహా బహుపసందైన వంటకాలతో భోజ నాలు ఏర్పాటు చేశాడు సింహాద్రి. మా మీద ప్రత్యేక అభిమానం చూపిస్తూ కొసరి కొసరి వడ్డించాడు... వచ్చిన జనాన్ని బట్టి ఆ విందు కెంత ఖర్చయి ఉంటుందో అంచనా వేయడా నికి ప్రయత్నిస్తూ భోజనం ముగించాను.

"రేపు మిమ్మల్ని కలుస్తాను శేఖరంగారూ!" అన్నాడు మేము వచ్చేసేటప్పుడు కిళ్ళీలందిస్తూ సింహాద్రి.

గురువారం వెళ్ళి శుక్రవారం వచ్చేసింది.

అన్నమాట ప్రకారం వచ్చి సింహాద్రి డబ్బు ఇవ్వలేదు. ఈరోజైనా వస్తాడేమో - డబ్బు ఇస్తా డేమో అనుకుంటే నిన్నటిలాగే ఈ వేళ కూడా ఆఫీసుకి ఎగనామం పెట్టాడు.

సింహాద్రి కిచ్చింది నా సొంత డబ్బు అయి వుంటే ఈవేళ కాకపోతే రేపు ఇస్తాడని సరి పెట్టుకొని ఉండేవాణ్ణేమో గానీ అచ్చారావుకలా సరిపెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఉదయం నేను డ్యూటీకొచ్చేటప్పుడు అతగాడు దారిలో తారసపడి- ఒక్క క్షణం స్కూటరాపి "ఈవేళ శుక్రవారం గురువుగారూ!" అంటూ సుతిమెత్త ని చెప్పుదెబ్బకొట్టి సర్రున వెళ్ళిపోయాడు.

అసలు సింహాద్రి కేమైంది?... ఉన్నట్టుండి ఎందుకు ఆఫీసు ఎగ్గొట్టినట్టు... అతనికి డబ్బం దలేదా... ఒంట్లో బాగుండలేదా... అనుకోకుం డా ఏదైనా ఊరెళ్ళాడా... సింహాద్రి డబ్బివ్వక పోతే ఏం చెయ్యాలి?... ఒకవేళ సింహాద్రి ఇంటికెళ్ళి శ్రీమతికి డబ్బు అందజేసాడేమో... ఇలాంటి ఆలోచనలతో పనిమీద మనసు నిల వలేదు. అయిదు గంటల వరకు ముళ్ళమీద కూర్చున్నట్టు గడిపి- అర్జంటుగా ఇంటికొ చ్చాను.

సింహాద్రి రాలేదని శ్రీమతి చెప్పడంతో ఉన్న మతి పోయింది. ఆ రోజు అతనొచ్చి డబ్బి స్తాడన్న ఆశ అటకెక్కింది. ఒళ్ళు మండుకొచ్చి వెంటనే సింహాద్రి ఇంటికొచ్చాను.

వీధివైపు తలుపు మూసి ఉంది. తలుపు తట్టడానికి చెయ్యెత్తిన వాడినల్లా-

"శేఖరంగారికి మీరేదో విధంగా నచ్చ జెప్పండీ!..." అన్న మాటలు లోపలనుంచి వినపడ్డంతో ఠక్కున ఆగిపోయాను. ఆ మాట లన్నది సింహాద్రి భార్య అని గ్రహించాను.

"అదే ఎలా చెప్పను? ఏమని చెప్పను?... కచ్చితంగా గురువారం ఇచ్చేస్తానంటేనే ఆయన డబ్బు అప్పుతెచ్చి ఇచ్చారు! నా ముఖం ఎట్లా చూపించేది?" అది సింహాద్రి గొంతు.

"నిన్నటి నుంచీ ఇలాగే అంటున్నారు! ఆయనకి కనిపించకుండా- ఆఫీసుకి పోకుండా ఎన్నాళ్ళు ఇంట్లో కూర్చుంటారు?... వెళ్ళి ఆ మాత్రం సర్ది చెప్పలేరా..." సింహాద్రి భార్య మాటల్లో హేళన ధ్వనించింది.

"ఇక ఎక్కువగా మాట్లాడక!... అసలిదంతా మా అమ్మా - నువ్వూ చేశారు, నేను అప్పు చెయ్యను మొర్రో - మన దగ్గరున్న డబ్బుతో కార్యక్రమం కానిచ్చేద్దామంటే- విందుకొచ్చిన వాళ్ళు పిల్ల చేతిలో పాతికో... యాభయ్యో పెడతారని, అలా వచ్చిన డబ్బుతో అప్పు తీరి పోవడమే గాక ఇంకా కొంత మిగులుతుందనీ సలహా ఇచ్చి నన్నిందులోకి దింపారు!... అప్పు తీరకపోగా చేతిలో అయిదు రూపాయలు లే కుండా అయిపోయింది నా పని! ఇప్పుడేం చెయ్యడం?" సింహాద్రి మాటల్లో బాధ వ్యక్త మయింది.

"బాగుంది లెండి... భోజనాలకొచ్చిన వా ళ్ళంతా కూడబలుక్కున్నట్టు స్టీలుప్లేట్లు-గ్లా సులు, కుంకుమభరిణెలు, పౌడరుడబ్బాలు తెచ్చి దాని ముఖాన కొడతారని మేము మాత్రం అనుకున్నామా? అదేం చిత్రమో - ఒక్కరంటే ఒక్కరు పిల్ల చేతిలో పది రూపాయలు పెట్టిన పాపాన పోలేదు..." అంటున్న సింహాద్రి భార్య మాటలు వింటూనే నాకు నవ్వాగలేదు...

నా నవ్వు లోపలకు వినిపించిందో ఏమో హఠాత్తుగా తలుపు తెరుచుకొంది. ఎదురుగా ఉన్న నన్ను చూసి తెల్లబోతూ "రండి శేఖరం గారూ... కూర్చోండి!" అన్నాడు సింహాద్రి.

"నేను కూర్చోడానికి రాలేదయ్యా! డబ్బు కోసం వచ్చాను..." కోపంగా అని- అతని ముఖంలోకి చూశాను.

సింహాద్రి కళ్ళలోంచి నీళ్ళు కిందికురక డానికి తొందరపడుతున్నాయి... నా కోపం మంచుముక్కలా కరిగిపోయింది... గద్గద స్వ రంతో అతనేదో చెప్పబోతూంటే వారించి "నాకేం చెప్పనవసరం లేదు సింహాద్రీ! నువ్వు డబ్బెందుకివ్వలేదో తెలుసుకుందామని వచ్చి అనుకోకుండా మీ మాటలు విన్నాను... గురు వారం నీకేదో బాపతు సొమ్ము అందుతుంది కాబోలనుకున్నానే తప్ప- విందుకొచ్చిన వాళ్ళు తలోకాస్తా ఇస్తే- ఆ డబ్బుతో అప్పు తీరుస్తావని అనుకోలేదు. అయితే అయిందిగానీ మీవాళ్ళు నీకు భలే సలహా ఇచ్చారయ్యా!... ఆడవాళ్ళేదో అలాంటి సలహా ఇచ్చారే అనుకో- నీ తలకా య ఎక్కడ పెట్టావో తెలియకుండా ఉంది!" అన్నాను సౌమ్యంగానే.

"అదే పొరబాటైపోయింది శేఖరంగారూ! మరో ఆలోచన లేకుండా- మీరు చెప్పినా విన కుండా ఆ సలహా ప్రకారం చేసినందుకు నాకు తగినశాస్తి జరిగింది! అనవసరంగా మిమ్మల్ని ఇరుకున పెట్టాను" అన్నాడు సిగ్గుపడుతూ సిం హాద్రి.

"ఇరుకున పెట్టానంటే కాదు- అచ్చారావు కివ్వాల్సిన డబ్బు సంగతేమిటో చెప్పు?" అన్నాను.

"ఇప్పుడు మీరే ఏదొకటి చేసి నన్నీ సమస్య నుంచి గట్టెక్కించాలి శేఖరంగారూ! వచ్చే నెల లో పి.ఎఫ్. లోన్ పెట్టి మీకు డబ్బిచ్చేస్తాను" అన్నాడు నా రెండు చేతులూ పట్టుకొని సిం హాద్రి.

ఇక అతన్నేమనడానికీ మనసొప్పలేదు- "సరే, మళ్ళీ ఎవడి కాళ్ళో పట్టుకొని అచ్చారావు కివ్వాల్సిన డబ్బు నేను సరిపెట్టి చస్తాలే! అంత కన్నా చేసేదేముంది? నువ్వు ఇంట్లో కూర్చోక రేపట్నుంచి ఆఫీసుకొచ్చెయ్..." అని ఏడవలేక నవ్వుతూ ఆ ఇంటి గడప దాటాను. ●